# బంపర్ బహుమతి

- వి.పి.బి.నాయర్

**పామరప్రజలు ఒక్కసారిగా అదిరిపడ్డారు. జుట్టు కత్తిరించుకునేవాళ్ళకు, గడ్డం గీయించుకునేవాళ్ళకు ఒక మారుతీకారు బహుమతిగా వస్తుందా! అది కూడా రేట్లు కాస్తయినా పెంచకుండా, జుట్టు కత్తిరించుకుంటే ఒక కూపనూ, గడ్డం గీయించుకుంటే ఒక కూపనూ. అంతే కాదు, గోళ్ళు కత్తిరించడం ఇత్యాది చిన్న చిన్న పనులకి కూడా కూపన్లు ఇస్తారట. మారుతీ బంపర్‌ప్రైజ్ ఇవ్వటానికి రేట్లు ఒక రూపాయి పెంచినా– ఎవరికీ దానిగురించి అభ్యంతరం ఉండదు. కానీ, ఒక్కపైసా కూడా పెంచలేదు.**

అసాధారణ ప్రజలకు, అంటే అసాధారణమైన బుద్ధి ఉన్నవాళ్ళకు, అందులో ఆశ్చర్యమేమీ కలగలేదు. అదేకదా వాళ్ళ ప్రత్యేకత! లేకుంటే వాళ్ళని బుద్ధిజీవులని ఎందుకు పిలవాలి? సామాన్యుల అభిప్రాయాలకి విభిన్నమైన ఆలోచనాసరళి ఒకవేళ వీళ్ళకు సహజంగా ఉత్పన్నం కాకపోతే వాళ్ళు అవి సృష్టించుకుంటారు.

రహస్య పోలీస్ అని కానీ, బుద్ధి రాక్షస పోలీస్ అనిగానీ, గూఢచారి పోలీస్ అనిగానీ, ప్రజలు అర్థం చేసుకున్న ఒక విభాగం అన్ని రాష్ట్రాలలో ఉంటుంది. ఈ విభాగంలో ఎక్కువ తెలివితేటలున్నవాళ్ళనే ఎన్నుకుంటారని జనాభిప్రాయం. కానీ, దానికి ప్రత్యేకించి ఐక్యూ టెస్ట్ ఏమీ నిర్వహించరు. అలాంటి టెస్టు అసలు అవసరమే లేదు. తెలివితేటలు ఎక్కువున్నవాళ్ళని ఒక్కచూపులో పసిగట్టెయ్యచ్చుకదా!

ఈవిధంగా, రూపొందించబడిన బుద్ధిశక్తి విభాగం, ప్రజల అభిప్రాయాలకి భిన్నమైన ఎలక్షన్ ప్రవచనాలు చెయ్యడంలో కుప్రసిద్ధి ఆర్జించడం మనందరికి తెలిసిన విషయమే. ఒక రాజకీయ పార్టీ అధికారంలో రెండు–మూడు సంవత్సరాలు కొనసాగితే, ప్రజలు దానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారనే విషయం, రిక్షావాళ్ళకీ, కూలివాళ్ళకీ, కార్మికులకి మాత్రమే కాదు, భిక్షాందేహిలకు కూడా తెలుసు. కేవలం, తెలుసుకోవడమే కాదు వాళ్ళకి అది ఖచ్చితంగా తెలుసుంటుంది. తాము చెప్పేది నిజం కాకపోతే, సగం మీసం తీసేస్తామని పందెం వేస్తారు. అటువంటి లఘు క్షవరానికి సిద్ధపడిన వాళ్ళని హేళన చేయాల్సిన అవసరం లేదు.

ఎందుకంటే, వాళ్ళు వేసేది పెద్ద విషయానికి చిన్న పందెం. పురాణకాలంలో, జూదంలో ఒక ప్రతిపక్ష నాయకుడు తన భార్యనే పందెంగా పెట్టి ఓడిపోతే, ఆమెని అధికారపక్షానికి అప్పజెప్పడం మనందరికీ తెలిసిన విషయమే.

ఇంతకీ, చెప్పొచ్చేదేమిటంటే, సామాన్యజనాల అభిప్రాయానికి విరుద్ధంగానే పోలీసుశాఖకి చెందిన ఈ బుద్ధివిభాగం ఆలోచిస్తారని.

మహాత్మాగాంధీగారి మూడు కోతుల్లాంటి వాళ్ళే కదా, ఈ విభాగాన్ని అలంకరిస్తారు. వారు సరియైన రీతిలో చూడరు, వినరు, మాట్లాడరు. యథారాజా, తథాప్రజా అన్నట్లుంటే ఫరవాలేదు కానీ, ప్రభుత్వం తరఫున ఆశావాదాన్ని మొత్తంగా కాంట్రాక్టు తీసుకునే వాళ్ళేకదా వీళ్ళు! చెప్పాల్సిన విషయం నుంచి, కొంత పక్కదారి పట్టినట్టుందే.

మారుతీ బంపర్‌ప్రైజ్ గురించి అసాధారణ ప్రజలకు ఆశ్చర్యం కలగలేదనే విషయం గురించే కదా మనం చెప్పుకుంటున్నది. ఎందువల్ల ఆశ్చర్యం కలగలేదు? మారుతీ బంపర్‌ప్రైజ్ ఇచ్చే ఆరు నెలల లోపలే, ఆ బార్బర్‌షాప్ ఓనరు కనీసం అయిదు లక్షల అధిక లాభం సంపాదిస్తాడని వారభిప్రాయం. జుట్టు కత్తిరించుకోవడం అంటే, మగవాళ్ళు కానీ, మగ పిల్లలుకానీ, కనీసం నెలకొకసారి చేయించుకునే కార్యక్రమమే కదా!

అది బయట ఎక్కడికన్నా వెళ్ళి చేయించాలి. ఆపని, ఈ షాపుకి వెళ్ళి చేయించుకుంటే, అత్యంత అదృష్టవంతుడైన ఒకడికి, ఎంత పెద్ద బహుమతి లభిస్తుంది!

హైదరాబాదు, సికిందరాబాదు, వాటి చుట్టుపక్కలున్న స్థలాలన్నీ కలిపి, మెగాసిటీ తయారవుతుందనేవార్త, ''పులి వస్తోంది, పులి వస్తోంది'' అనే అరుపుల్లాగే వినీ, వినీ, విసుగెత్తిన ప్రజల మధ్యలో ఈ మెగాప్రైజ్ ఒక చర్చావిషయమైంది. ఒకే ఒక ప్రైజ్ ఇవ్వడం బాలేదని, రెండోప్రైజ్, మూడోప్రైజ్ కూడా ఇస్తే బాగుంటుందని కొంతమంది అభిప్రాయపడ్డారు.

జుట్టు కత్తిరించుకునేవాళ్ళకి ప్రత్యేకంగా, గడ్డం గీయించుకునేవాళ్ళకి ప్రత్యేకంగా, బహుమతులు ప్రకటించాలని కొంతమంది అనుకున్నారు.

ఎవరికి ఏవిధమైన అభిప్రాయాలున్నప్పటికీ, మన రోమశత్రురావులో మాత్రం ఎలాంటి చలనం రావటానికి వీల్లేదు.

స్వంత అభిప్రాయాలకి ఫెవికాల్ వేసి అతికించినట్టు దృఢంగా నిలబడే ఒక వ్యక్తి అతను. తన క్షౌరశాల బయట గోడమీద చేత్తో రాసిన ప్రకటన ఒకటి అంటించిపెట్టాడు.

అంతే– అలాకాకుండా, మూడు భాషల్లో ఉన్న డెక్కన్‌క్రానికల్, ఈనాడు, సియాసత్ లాంటి వార్తాపత్రికల్లో ప్రకటనలేమీ ఇవ్వలేదు. అలా ఇచ్చే ఆర్థికసోమత అతనికి లేదనే వాస్తవం, అతని భార్యకే కాక, పక్కింటివాళ్ళకు కూడా తెలుసు.

ఆ షాపు కిటికీ దగ్గర ఒక పెద్ద నోటీసు రావడం, ప్రజల్లో ఒక సంచలనం సృష్టించిందంటే, దాని అర్థం కేశసంహారావు ఉద్దేశ్యం ఫలించిందనే కదా!


ఏదేమయినప్పటికీ, ఒక కుర్చీ, ఒక అద్దం ఉన్న ఆ షాపులో రెండు మూడు కుర్చీలూ, అద్దాలూ వచ్చి చేరాయి.

నాలుగోది అమర్చాలని ఉన్నా ఏం చెయ్యాలి? షాపులో స్థలం సరిపోదే. మారుతీ బంపర్‌ప్రైజ్ ప్రకటించకముందు ఏకలభ్యుడుగా, ఆ షాపులో ఎక్కువసేపు ఈగలు తోలుకుంటూ, వెంట్రుకలు లెక్కబెట్టుకుంటూ, గడుపుతుండే ఆ బార్బర్‌షాపువాడికి ఆశ్చర్యమేసింది, ''మూడు కుర్చీలు, నలుగురు పనివాళ్ళు ఇక్కడ పనిచేస్తున్నా, కష్టమర్లు మాత్రం క్యూలో నిలబడాల్సి వస్తుందే'' అని. ఒక్కో నెల గడుస్తున్నకొద్దీ, అతని ఇంట్లో సుఖైశ్వర్యాలు వృద్ధిచెందుతూ వచ్చాయి.

ఆరు నెలల తర్వాత, మారుతీ బంపర్‌ప్రైజ్ లాటరీ తీసేరోజు దగ్గరపడే సమయానికి, పాతప

కటన మీద మరో కొత్త ప్రకటన అంటించబడింది... ''ప్రజల కోరిక మీద లాటరీ తేదీ మార్చి పదిహేనవ తేదీ వరకూ పొడిగించబడింది.'' జనవరి పదిహేనున తీయాల్సిన లాటరీ, మార్చి పదిహేనుకి వాయిదా వేయడం చూసి, ప్రజలకు అమర్షమేమీ కలగలేదు.

అలా వాయిదా వేయమని ఎవరో ఒత్తిడి చేసుంటారని, ప్రజల్లో కొంతమంది నమ్మారు కూడా. కానీ, మార్చి పదిహేనో తారీఖు వచ్చేసరికి, మరో మూడునెలలు పొడిగించడం చాలామందికి రుచించలేదు. కొంతమంది బార్బర్‌షాపు యజమానితో చిన్నస్థాయి వాగ్యుద్ధాలు చేయడం కూడా జరిగింది.



''మీరొక్కళ్ళే కాదే ఇక్కడ జుట్టు కత్తిరించుకునేది. మీ దగ్గర మహా అయితే తొమ్మిదికూపన్లు ఉండుంటాయి. కానీ, ఒక్కొక్కళ్ళ దగ్గర ఒకటో రెండో కూపన్లు ఉంటాయి. అటువంటి వాళ్ళకు ఇంకా రెండో, మూడో కూడా సంపాదించాలనుంది. వాళ్ళ కోరికని కూడా నేను పరిగణించాలి కదా!''

''నీ ఎత్తులు మాముందు సాగవు. నీ కుయుక్తులు ఎవరికీ అర్థం కావనుకున్నావా? ఈ తొమ్మిది నెలల కాలంలో నువ్వెంతో సంపాదించి ఉంటావు. కనీసం, ఇప్పుడైనా నీ దొంగాటలు ఆపేస్తే మంచిది.''

''నాపని ఆపేయాల్సిన అవసరం ఏముంది సార్? ఎవరినీ సతాయించకుండా, నాపని నేను చేసుకుంటున్నాను. చేసే పనికి నేను కూలి తీసుకుంటున్నాను. ఎవ్వరికీ, ఎటువంటి నష్టం కలిగించడంలేదు. ఇహపోతే, లాటరీ విషయమంటారా? అది నేను తీసినా, తీయకపోయినా, నన్ను అనేవాళ్ళెవరూ లేరు. లాటరీ పేరు చెప్పి, ఇంతవరకూ ఎవరి దగ్గర్నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదు. దాని గురించి రేట్లు కూడా ఏమాత్రం పెంచలేదు.''

ఇలాంటి వాగ్వివాదాలు ఎన్ని జరిగినాకానీ, జన్మతః మంగలి కాని రోమశత్రురావు ముందు మహామహులైనా తలవంచక తప్పదు కానీ, అతనికి మాత్రం ఎవరి ముందూ తలవంచాల్సిన పరిస్థితి ఏర్పడలేదు.

ఏమిటి? అతను మంగలిగా పుట్టలేదా?

అతని తల్లితండ్రులు ఆ వృత్తిని ఎప్పుడూ చేపట్టలేదు. అతని తల్లివైపుగానీ, తండ్రివైపుగానీ, పూర్వీకులెవరూ అటువంటి పని చేయలేదు. అలాంటప్పుడు ఇతను మాత్రం ఆ వృత్తిలో ఎలా ప్రవేశించాడు?

మెట్రిక్యులేషన్ పరీక్ష కంపార్ట్‌మెంటల్‌గా రాసి నాకూడా విజయశ్రీ చేత వరించబడటంలో అపజయం పొందిన రోమశత్రురావు డ్రైవింగ్ నేర్చుకుని, లైసెన్స్ కూడా సంపాదించుకున్నాడు. డాక్టర్లకు మనుషుల్ని చంపడానికి లైసెన్స్ ఉందని కొంతమంది అంటారు. కానీ, డ్రైవర్లకు అలాంటి లైసెన్స్ ఏమీలేదు. ఆ విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకున్న రోమశత్రురావు ఏ ఒక్కరిని కూడా తన బండికిందకి రానియ్యలేదు.

పదేళ్ళ వయస్సుండి, కండిషన్ అంత బాగా లేని కారుని... ధర్మారావుగారిది... రోమశత్రురావు నడుపుతుండగా---

ఒకరోజు,

ముందు గుర్రాన్ని, పైన గడ్డిని నడుపుకెళుతున్న బండికి, ఆకస్మిక దిశాభ్రంశం కలిగినట్టు చూసిన రోమశత్రు, ఎంతో చాకచక్యంతో బ్రేకువేసి, స్టీరింగ్‌ని తిప్పి కారు ఆపగలిగాడు కానీ, 'హమేషా డర్' అని వర్ణింపబడే ఆ యాంత్రిక వాహనం, నిశ్చలావస్థకి రావడం, ఆ గుర్రపుబండి చక్రాన్ని ఢీకొట్టిన తరువాతే జరిగింది. గుర్రపుబండివాడు, బండి దిగొచ్చి, రోమశత్రురావుకు పులిసిన తిట్లతో సన్మానం చేయగా, గాడిద చుట్టమైన ఆ చిన గుర్రం, ''తప్పునాదే కదా'' అన్న గిల్టీఫీలింగ్‌తో తల కిందకి దించి, నోరు తెరిచి, ఒక మందబుద్ధి నవ్వు ప్రసారం చేస్తూ నిలబడింది.

కారు వెనకడోరు నుంచి దిగిన ధర్మారెడ్డిని చూసి, ''నాకూ, నా గుర్రానికి అదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదమేమీ కలగలేదు. ఇకముందెప్పుడూ కళ్ళు మూసుకుని కారు నడపద్దు'' అనే హెచ్చరికని అతని మీద గిరాటేసి, గడుసుతనంగా ఆ బండివాడు అక్కడి నుంచి సత్వరం నిష్క్రమించాడు.

కారుకి మాత్రం బాడీపెయింట్‌లో కొద్దిగా గీతలు పడ్డాయి. దాని గురించి ధర్మారెడ్డికి రోషం

## ష్..గప్‌చిప్

టెలిఫోన్ బూత్ దగ్గర ''పావుగంట నుంచి ఫోన్ పుచ్చుకుని అలా నిలబడిపోయారు. మాట్లాడకపోతే పెట్టెయ్యండి సార్''

''ష్! మావిడతో మాట్లాడుతున్నాగా...''

-చందూవంశీ (నంద్యాల)

## చెప్పండి

''శ్రీవారు నేను ఏ సమయంలో మీకు అందంగా కనిపిస్తానో చెప్పండి'' అడిగింది భార్య నవ్వుతూ.

''ముఖానికి బాగా సబ్బు రుద్దుకొని చెంబు కోసం వెదికేటపుడు శ్రీమతి'' చెప్పాడు భర్త.

-పి.శేషంశెట్టి (నంద్యాల)

## కట్నం

అప్పల్రాజు తన కొడుక్కి సంబంధం కోసం గోవిందరాజు ఇంటికెళ్లాడు.

''మా అబ్బాయికి మీ అమ్మాయిని చేసుకుంటే కట్నం ఏమిస్తారు?'' అడిగాడు అప్పల్రాజు.

''రెండెకరాల కొబ్బరి తోట'' చెప్పాడు గోవిందరాజు.

''ఇంకా...''

''లక్షరూపాయలు కేష్''

''ఇంకా''

''కలర్ టి.వి, ఫ్రిజ్''

''ఇంకా చెప్పాలి''

''ఓ హీరో హోండా బైక్''

''ఇంకా ఏమిస్తారు''

''ఓ పోలీస్ కంప్లైంట్''

-గుత్తుల శ్రీనివాసరావు (దొంతికుర్రు)

రాలేదు. ఎందుకంటే, ఆ పదేళ్ళ పడుచుకారుకి, గీతలూ, రేఖలూ రావడం కొత్తకాదు. అయినప్పటికీ, ఒక కారు యజమాని కర్తవ్యపాలనాపరంగా, అతను డ్రైవరుని ఛడామడా దులిపేసాడు.

ఇంచుమించు ఇలాంటి మరొక యాక్సిడెంటే సంభవించినప్పుడు--- అదీ మరో పదిరోజుల్లో--- ధర్మారెడ్డి ధర్మదోషం మళ్ళీ ప్రకటితమైంది.

అది జరిగి వారమైనా కాలేదు--- ఆ కారు తనముందు ఒక చిన్నసైజు కూచిపూడి నృత్యం చేసిన సైకిల్‌ని గుద్ది కిందకి పడేసింది. సైకిల్ వాడికి పెద్ద దెబ్బలేమీ తగల్లేదు.

సైకిల్‌కి కూడా అంత నష్టమేమీ కలగలేదు. ధర్మారెడ్డి, అతనికి వందరూపాయలిచ్చి, అంతటితో సర్దుబాటు చేసాడు. తరువాత, అతను డ్రైవరువైపు తన అమర్షాన్ని మళ్లించాడు.

''ఏరా! నువ్వూ ఒక డ్రైవర్‌వేనా? నీకు డ్రైవింగ్ లైసెన్స్ ఎవరిచ్చారు? ఇహ నువ్వు బండి తోలద్దు. ప్రతిరోజూ ఇలా నా కారుకి క్షవరం చేసే బదులు నువ్వే స్వంతంగా ఒక మంగలిషాపు పెట్టుకోకూడదా'' అలా ముందుకి సాగింది అతని ధర్మోపదేశం.

ఆ కర్మోపదేశాన్ని తూ.చా. తప్పకుండా స్వీకరిస్తూ, రోమశత్రురావు ఆరోజు సాయంత్రమే తన సారథ్య విధులకి స్వస్తి చెప్పడం జరిగింది.

మరోకొద్ది రోజుల్లోనే, ఎవరి అభిప్రాయం కనుక్కోకుండానే, 'సారథీ బార్బర్ సెలూన్' అనే ఒక సంస్థని ప్రారంభించాడు.

ఒక కుర్చీ, ఒక అద్దం, ఒక బార్బర్ అనే చిన్న స్థాయిలో మొదలుపెట్టి, ఆరునెలలలోపలే, రెండు కుర్చీలు, రెండు అద్దాలు, ఇద్దరు బార్బర్లు అనే రెండువందల శాతం వృద్ధి చేయడానికి కావలసిన ఆర్థిక స్తోమత అతనికరగతమైనా, వీటన్నిటినీ చేయకుండా, ఉన్న ఒక బార్బర్‌ని కూడా పంపించేశాడు. ఆ ఆరునెలల సమయంలో, చిన్నపిల్లలకి జుట్టు కత్తిరించడం, పేదవాళ్ళకి గడ్డం గీయటం ప్రాక్టీసు చేసి, కావల్సినంత ఆత్మవిశ్వాసం సంపాదించిన అతనికి, తన చేతుల సామర్థ్యం గురించి శంకించే అవసరం ఎప్పుడూ రాలేదు.

ఆవిధంగా, ఎటువంటి అలజడులు లేకుండా, హాయిగా జీవితాన్ని గడుపుతున్నప్పుడు, అతని మస్తిష్కంలో మారుతీ బంపర్‌ప్రైజ్ అనే ఒక ఆలోచన మెరుపులా మెరిసింది.

మారుతీ బంపర్‌ప్రైజ్ స్కీమ్ మొదలుపెట్టిన పన్నెండు నెలల తర్వాత, ఒక సుప్రభాతంలో...

ఆ లాటరీ కార్యక్రమం జరిగింది. ఒకే ఒక ప్రైజుకు నంబరు తీసే ఆ శుభసమయానికి సాక్షులుగా వందలాది మంది వచ్చుంటారు.

ఆ ఏరియా సబ్‌ఇన్‌స్పెక్టర్ మఫ్టీలో వచ్చాడు. ఎందుకంటే, మఫ్టీలో వచ్చి పైసా ఇవ్వకుండా జుట్టు కత్తిరించుకోవడం, గడ్డం గీయించుకోవడం ఎనిమిది పదిసార్లు చేయించుకున్న ఆ మహనీయుడు, ఆ చేయించుకున్న పనులకి కూపన్లు మాత్రం తీసుకున్నాడు.


అదృష్టదేవత అతనివైపు చూసి, ఉలిక్కిపడి, ఒక చిరునవ్వు నవ్వితే, అతనికి వచ్చేదేమిటి?... ఫ్రీగా ఒక మారుతీకారే కదా! కానీ, లాటరీలో వచ్చిన నంబర్‌కి, అతని కూపన్ల నంబర్లతో ఎటువంటి దగ్గర సంబంధమూ కనిపించలేదు. నిన్ను తర్వాత చూసుకుంటాన్రా అనే అర్థానిచ్చే చూపు- ఆ రోమశత్రుమీద పారేసి, ఆ పోలీసాఫీసరు, ఒక ఎబౌటర్న్ కొట్టి- లెఫ్ట్‌రైట్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు. ఆ బెదిరింపుకి జడిసిపోయినట్టు అభినయిస్తూ- రోమశత్రు, అయ్యా! డ్రా తీసేది నేను కాదు. ఈ మాజీ ఎమ్మెల్యేగారు మీక్కూడా తెలుసు. ఆయన మనసులో ఏ నంబరు తీయాలని ఉన్నా, ఈ లాటరీ సిస్టిమ్‌లో అలా వీల్లేదు అన్నట్టు రెండు చేతులూ కలిపి ఎంతో కిందకి వంగి వంగి వినయంగా దణ్ణంపెట్టాడు.

ఆ లాటరీ తిలకించడానికి వచ్చిన ప్రజలకి, బంపర్‌ప్రైజ్ అయిన మారుతీకారుని చూడాలనే కుతూహలం ఉండేది. వారి ప్రశ్నాస్త్రాలు తన శరీరాన్ని తాకి, ఒక చిన్న గాయమైనా చెయ్యనివ్వకుండా, మహాభారత్ అనే టీవీ సీరియల్‌లో అర్జునుడు తప్పించుకోవడానికి అటూ, ఇటూ కదిలినట్టు, మన హీరో కూడా ఎంతో యుక్తిపూర్వకంగా తనను తాను రక్షించుకున్నాడు.

మర్నాటి ఉదయం పదిగంటలకి ప్రైజ్ టిక్కెట్‌తో పట్టలేని ఆనందంతో, మల్లేశ్వరరావు ఉన్మాదగ్రస్తమైన ఒక పెనుగాలి, ఆ బార్బర్‌షాపులోకి రావటం, రాగానే తన గతి వేగతను ఒక సడన్‌బ్రేక్ వేసినట్టు ఆపటం, అక్కడున్న వాళ్ళకు విస్మయాన్ని కలగజేసింది. తన అమితానందాన్ని అదుపులో పెట్టలేకపోవటంవల్లా, పరుగెత్తి రావడంవల్లా, ఊపిరి క్రమాతీతంగా పెరగడంవల్లా అతని గుండెదడ సూపర్‌సోనిక్ వేగతకు చేరుకుంది.

బార్బర్‌షాపు యజమానిని చూడగానే, బార్బరా కార్ట్‌లాండ్‌గానీ, బార్బరాస్ట్రీసెండ్‌నిగానీ, చూసిన అనుభూతి అతనికి కలిగింది.

అరబ్ దేశాల్లో ప్రెసిడెంట్లుగానీ, ప్రధానమంత్రులుగానీ, అదే హోదాలో ఉన్న అతిథులకి



స్వాగతం చెప్పేటప్పుడు- పట్టువదలకుండా ఎక్కువసేపు కరచాలనం చేస్తున్నట్టు, ఈ మల్లేశ్వర రావు, రోమశత్రురావుని మలేరియా రోగిలా మార్చాడు. ఏం చెప్పాలో, ఏం అడగాలో అర్థం కాక, ఆ అదృష్టజాతకుడు, మాట పెగలకుండా కాస్సేపు అలా ఉండిపోయాడు. చివరికి ఎలాగో-

''నా మారుతీకారు ఇంకా రాలేదా?'' అని అడిగాడు.

''ఏమిటి సార్! మీ కారుని, మీకన్నా ముందే ఇక్కడికి పంపించేసారా?'' అని ఆ షాపువాడి ఎదురుప్రశ్న.

''నాకు కారేమీ లేదు. నేనడుగుతున్నది ఈ లాటరీలో వచ్చిన నా కారు గురించి.''

''మీరు కాస్త ఇటు రండి'' అంటూ రోమశత్రు, మల్లేశ్వర్రావు చెయ్యి పట్టుకుని బయటికి తీసుకెళ్ళి, కిటికీ పక్కన ఉన్న ప్రకటనని చూపిస్తూ- ''చూడండి సార్! ఇది కాస్త శ్రద్ధగా చదవండి'' అని అతివినయంగా అభ్యర్థించాడు. మల్లేశ్వర్ దానిలోని ప్రతీ అక్షరాన్ని శ్రద్ధగా చదివాడు. లాటరీలో గెలిచినవారికి ఒక మారుతీ బంపర్‌ప్రైజు వస్తుందనే విషయం దానిలో స్పష్టంగా రాసుంది.

''అవునవును. ఈ మారుతీకారు గురించే నేను చెపుతున్నాను'' అని మల్లేశ్వర్ ద్విగుణీకృతమైన ఆశాభావం ఒలకపోశాడు.

ఆషాపు యజమాని పెదవులు, పై పెదవి మీద పురిపాకలాంటి గడ్డిమీసాలు కలిసి ఒక కుట్ర పన్నినట్టు దాదాపు వేళాకోళపు నవ్వు తాలూకూ సూచన పతాకం ఎగరేశాయి.

''మీకు రావలసిన వస్తువు లోపల జాగ్రత్తగా ఉంచాను'' అని చెపుతూ రోమశత్రురావు లోపలికి వెళ్తుంటే, పదోక్లాసు పబ్లిక్ పరీక్ష బాగా రాయని విద్యార్థి పరీక్షా ఫలితాలు వెలువడే లోపల, రహస్యంగా తెలుసుకునేందుకు ఒక అధికారిని ఉబలాటంగా కలుసుకోడానికి వెళ్ళినట్టు, మల్లేశ్వర్ ఒక రాపిడ్‌స్పీడ్‌లో అతన్ని అనుసరించాడు.

ఎంతో జాగ్రత్తగా ప్యాక్ చేసిన ఒక వస్తువును రోమశత్రురావు మల్లేశ్వర్‌కి అందించేటపుడు, షాపులో జుట్టు కత్తిరించుకోడానికి వచ్చిన నలుగురైదుగురు ఎంతో కుతూహలంగా చూస్తుండగా, జుట్టు కత్తిరించేవాళ్ళు మాత్రం వమనంలా వస్తున్న నవ్వునాపుకోడానికి ప్రయత్నిస్తున్నారు.

''హేమిటి? ఇదేమిటి?'' అని మల్లేశ్వర్ అదిరిపాటుతో అడిగాడు.

''అర్థంకాలేదా సర్! మారుతీకారు తాలూకూ బంపర్. దీన్నే ప్రైజుగా ఇస్తామని ఆ ప్రకటనలో రాయబడింది.''

పాతగుడ్డపేలికలా సర్వాంగాలు వేలాడిపోతూ, అతను కుప్పకూలిపోయాడు.

గోడకి చెయ్యి ఆనించి, ఇరవైశాతం వరకూ, అతను నిలదొక్కుకుని భీకరంగా అరిచాడు.

''ఓరి పాపాత్ముడా! అయితే నువ్వు జనాలని మోసం చేస్తున్నావా?'' అని అడుగుతూ తన పిచ్చికోపాన్ని అణుచుకోవడం వీలుకాక, రోమశత్రురావువైపు రెండడుగులు వేయగా, అక్కడ పని చేస్తున్న మంగళ్ళిద్దరూ ఒక క్షణం తమ పనులు ఆపేసి, మల్లేశ్వర్‌వైపు రెండడుగులు వేశారు.

వాళ్ళల్లో ఒకడి చేతిలో కత్తెర. మరొకడి చేతిలో కత్తి ఉండటం గమనించి, ముందుకు వేసిన అడుగులు వేసినట్టే వెనక్కి తీసుకున్నాడు.

చేతిలో ఉన్న బంపర్‌ని కిందకి పారేసి, ''నిన్ను ఇంతటితో వదిలేస్తాననుకున్నావా? తిన్నగా నేనిప్పుడు పోలీస్‌స్టేషన్‌కే వెళుతున్నాను. ఇదొక కూష్మాండపట్టణమని అనుకుంటున్నావా? కోర్టుల చుట్టూ తిరిగిననాడు నీకు అర్థమవుతుంది.''

''కోర్టు అయ్యలకు కూడా జుట్టు పెరుగుతుంది. వాళ్ళకి కూడా క్షవరం చేయడానికి నేను సిద్ధమే'' అని ఎటువంటి చలనం లేకుండా, షాపు యజమాని చెప్పడం విని, కత్తిరిస్తున్నవాడు పెద్దగా నవ్వేసరికి, కస్టమర్ జుట్టు మరికాస్త ఎక్కువ కత్తిరింపబడింది. దాన్ని సరిచేసుకోడానికి, చుట్టుపక్కల ఉన్న జుట్టు ఇంకాస్త కత్తిరించాల్సి వస్తుంది. కానీ, ఆ కస్టమర్‌కి మాత్రం, ఇది తెలియలేదేమో! చేతిలో కత్తి ఉన్న మంగలి ఇదేలా నవ్వకపోవడం, ఆ కత్తికిందనున్న మెడ చేసుకున్న అదృష్టమేనేమో.

''ఓ సారూ! మీరు మీ ఇష్టమొచ్చిన చోటికి పోయి కంప్లైంటు ఇచ్చుకోండి. కావాలంటే, సుప్రీంకోర్టు వరకూ వెళ్ళండి.


అయితే, ఒక్కమాట. మేమిక్కడ చేస్తున్న పనికి మామూలుగా తీసుకునే రేటు నుంచి ఒక్కపైసా కూడా ఎక్కువ వసూలు చేయలేదు.

ప్రకటనలో చెప్పినట్టు మీకు రావాల్సిన మారుతీ బంపర్‌ప్రైజ్ మీకిచ్చేసాను. దాని ఖరీదు ఎంతుంటుందో మీకు తెలుసా? ఒక్కపైసా కూడా ఖర్చుపెట్టకుండా, మీకు ఇంత పెద్ద బహుమతి ఊరికే దొరుకుతున్నప్పుడు, మీరు సంతోషించాలి. జీవితాంతం నేను మంగలిపని చేస్తున్నా కూడా, ఒక మారు తీకారు కొనడం నావల్లకాదు.

చివరగా ఒక ప్రశ్న మిమ్మల్ని అడగాలి. మీ ఉద్దేశ్యమేమిటి? మీరు నాకే క్షవరం చేయాలనుకుంటున్నారా?''

★

## మరో విడాకులోపాఖ్యానం



'శ్రీదేవి, బోనీకపూర్ నుండి విడాకులు తీసుకోబోతోంది' అనే వార్త బాలీవుడ్‌లో వినిపిస్తోంది. 'ఇలా ఎందుకు?' అని ప్రశ్నిస్తే బోనీకపూర్ ప్రవర్తనకు శ్రీదేవి పూర్తిగా విసిగిపోయిందనే జవాబొచ్చింది. బోనీకపూర్ ఈమధ్య శ్రీదేవితో కలిసి తిరగడంకన్నా తన మొదటి భార్య పిల్లలకు దగ్గరవడానికే ఎక్కువ ప్రిఫరెన్స్ ఇస్తున్నాడుట. అదీగాక బోనీకపూర్ మొదటి భార్య కూడా భర్తతో తాడోపేడో తేల్చుకోవాలనే స్థితికి వచ్చేసిందిట. మొన్నటికి మొన్న ఆమె ఓ ఎన్నారైతో ప్రేమలో పడిందిగానీ దురదృష్టవశాత్తు అతడు యాక్సిడెంట్‌లో మరణించాడు. ఆమె మళ్లీ 'మరో పెళ్లి' ఆలోచనలో వుందిట. ఇది తెలిసి బోనీకపూర్ తన మొదటి భార్య మరొకడికి భార్య అయితే అది తన కుటుంబ గౌరవానికి భంగకరం కాబట్టి ఆమెను మంచి చేసుకునే ప్రయత్నంలో వున్నాడుట. సో! అందుకే శ్రీదేవి విడాకుల ప్రయత్నం కాబోలు!

-జె.వి.బాబు

